

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శాంతి హోమం

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పరిధిలోని కార్యశిద్ధి అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం రాత్రి శాంతి, మృత్యుంజయ హోమాలు, మహా తైలాభిషేకం ఘనంగా నిర్వహించారు. సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన హోమానికి వాల్మీకిపురం, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

నందీశ్వరుడికి అభిషేకం

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో బాహ్య నందీశ్వరుడికి శనివారం ప్రదోషకాల అభిషేకం నిర్వహించారు. యోగభోగేశ్వరుడిని అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శనిత్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యోగాంధ్రపై అవగాహన

రామసముద్రం: యోగాపై రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ నాగరాజ ఆధ్వర్యంలో యోగ వలన కలిగే లాభాలను శిక్షకులు వివరించారు. ఎంపీడీవో భానుప్రసాద్, ఈవోపీఆర్‌డీ గఫూర్, ఎస్‌ఐ రవికుమార్, మెడికల్ ఆఫీసర్ లీల, ఏపీఎం బశివ, ఏపీవో మాధవి, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లకు దోచిపెట్టేందుకే ఎండీయూ వ్యవస్థ రద్దు

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఎండీయూ ఆపరేటర్ల నిరసన


మదనపల్లె సబ్ కలెక్టర్‌రేట్ వద్ద ఆపరేటర్ల నిరసన తెలుపుతున్న ఎండీయూ ఆపరేటర్లు

మదనపల్లె: చౌక దుకాణాల డీలర్లకు దోచిపెట్టేందుకే కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ రద్దు చేసిందని ఎండీయూ ఆపరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉన్న పళంగా వాహన సేవలను నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన 55మంది ఆపరేటర్లు సబ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట నిలబడి ఎండీయూ వాహన సేవలు కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆపరేటర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను ఇంటింటికీ వెళ్లి అందించే కార్యక్రమంపై 2027 జనవరి వరకూ ఒప్పందం ఉన్నప్పటికీ, పరిగణలోకి తీసుకోకుండా సేవలను రద్దు చేస్తూ నిర్ణయించడం తమ కుటుంబాలను వీధిపాలు చేయడమే అన్నారు. ఎండీయూను నమ్ముకుని జీవిస్తున్న ఆపరేటర్లు, హెల్పర్ల పొట్ట కొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంవల్ల 18,500 మంది రోడ్ల పాలయ్యారని, చౌక డీలర్లపై 6 వేలకుపైగా 6ఎ కేసులు పెండింగ్‌లో ఉండగా, మళ్లీ వారికే నిత్యావసర పంపిణీ బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఇన్‌చార్జి ఏఓ అనీషాకు వినతిపత్రం అందజేశారు. ఉదయ్‌కిరణ్, గంగాధర్, బాబ్‌జాన్, రాము, మధుకర్‌రెడ్డి, వేణురెడ్డి, రెడ్డికుమార్, బాలాజీ, మునీర్ ఖాన్, ఆశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి సహకారం

మదనపల్లె రూరల్: మండలంలోని చిప్పిలి గ్రామంలో వెలసిన పాలేటి గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. పాలేటి గంగమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన పూజలకు నిస్సార్ అహ్మద్, ఏపీ బీసీ కమిషన్ సభ్యులు జన్నే శేషాచలపతినాయుడు, సర్పంచ్ పసుపులేటి చలపతి హాజరయ్యారు. అమ్మవారిని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిసార్ అహ్మద్ మాట్లాడుతూ చిప్పిలి గ్రామదేవత పాలేటి గంగమ్మ తల్లి మహిమ గల దేవతగా ఖ్యాతి గడించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, చిప్పిలి వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శరత్‌రెడ్డి, మల్‌రెడ్డి, మునిశేఖర్, ఈశ్వర్‌నాయక్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఖాజాపీర్, కొత్తపల్లె మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దైవ సన్నిధిలో కళ్యాణమండపం: కలకడ: ఎన్‌ఆర్‌ఐల సహకారంతో కల్యాణమండపం నిర్మించడం సంతోష దాయకమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక దేవళంపేటలోని ప్రసిద్ధి కామాక్షి సమేత సిద్ధేశ్వరాయం సమీసంలో ఎన్‌ఆర్‌ఐ సురేంద్రనాయుడు, స్వరూప దంపతుల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిశోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, మండల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని గుర్తు చేశారు. విశ్వనాథ్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, మల్లికార్జుననాయుడు, ధర్మకర్త హరిశర్మ పాల్గొన్నారు.

ఘనంగా ఉట్లమాను ఉత్సవం

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి కల్యాణం తిలకించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామవీధుల్లో పాటల కచేరీలు, చెక్క భజనలు, కోలాటం, మేళతాళాల మధ్య వైభవంగా ఊరేగించారు. కల్యాణోత్సవం లడ్డూకు వేలం నిర్వహించగా నిమ్మనపల్లె కోటకిందపల్లెకు చెందిన శంకర రూ.42 వేలకు దక్కించుకున్నారు. శనివారం ఉట్లమాను ఉత్సవాన్ని ఆలయ ధర్మకర్త శంకరయ్య, బయమ్మ దంపతుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కోలాహలంగా నిర్వహించారు. ఉట్లమాను విజేతమల్లిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి రూ.2,116 బహుమతిగా అందజేశారు.

మినీ మహానాడుకు శంకర్ వర్గీయుల డుమ్మా


మినీ మహానాడులో పాల్గొన్న నాయకులు

ములకలచెరువు: మినీ మహానాడుకు జి.శంకర్ వర్గీయులు గైర్హాజరు కావడం తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదాలకు అద్దం పడుతోంది. ములకలచెరువులోని ఓ కల్యాణ మండపంలో తెదేపా నాయకుడు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల కాలంలో మృతి చెందిన టీడీపీ సానుభూతి పరుల ఆత్మ శాంతి కోసం కాసేపు మౌనం పాటించారు. అనంతరం నియోజకవర్గంలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాల తీర్మానాలను క్షుణంగా వివరించారు. నిరుద్యోగ నిర్మూలనకు కారిడార్ ఏర్పాటు, వ్యవసాయానికి చేయూత, ఆలయాలు, రోడ్ల అభివృద్ధి, మహిళల ఆర్థిక అభివృద్ధిపై మహానాడులో చర్చిస్తానని జయచంద్రారెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉండగా అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జయంద్రారెడ్డి వర్గీయులు ఒక వైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీ.శంకర్ వర్గీయులు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించేవారు. దీంతో జయచంద్రారెడ్డి నిర్వహించిన కార్యక్రమానికి శంకర్ వర్గీయులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.

ఫ్లెక్సీల చించివేత

టీడీపీ నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఆయన అనుచరులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ వర్గీయులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్గీయులే చించివేసి ఉంటారని పలువురు తెలుగు తమ్ముళ్లు చర్చించుకోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బస్టాండులో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేసారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు

మదనపల్లె: రాష్ట్రంలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనుబంధ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సాధారణ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ మూడు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆప్కాస్ ద్వారా ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల పిల్లలకు దినసరి వేతనంతో ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. మదనపల్లెలో పారిశుద్ధ్య కార్మికుల ఇళ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, కృష్ణప్ప, సాంబశివ, సురేషకుమార్, మస్తాన్, ముబారక్, తిరుమలదేవ, వాసు, చలపతినాయక్ పాల్గొన్నారు.



విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

మదనపల్లె సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక విశ్వం ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విద్యలో కాషాయీకరణను బీజేపీ ప్రభుత్వం తెస్తోందన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల జోక్యం నివారించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విధానాలు భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, నరసింహ, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

మదనపల్లె రూరల్: బిసెంట్ థియోసఫికల్(బీటీ) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రిన్సిపల్ డాక్టర్.జి.ఆనందరెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆనందరెడ్డి మాట్లాడుతూ బీటీ కాలేజ్ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తోందన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. . గురునాథ్, కరీం, చలపతి, సురేంద్ర, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అక్రమాలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కోరారు. ఆస్పత్రుల్లో అవినీతి, అక్రమాలపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవల కోసం వెళ్లిన పేదలను నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు బెంగళూరు, చెన్నై తదితర మెట్రోపాలిటన్ సిటీ స్థాయిలో డబ్బు వసూలుచేస్తున్నారని, డిశ్చార్జి సమ్మరీ ఇవ్వమంటే దాడులు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి పది గంటల తర్వాత అడ్మిషన్లు దొరకడం లేదని, ఆస్పత్రికి వెళ్లిన రోగులను, వైద్యులు లేరంటూ పంపుతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందితో లాలూచీ పడి సిబ్బంది వేల రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే తిరుపతి, వేలూరుకు రెఫర్ చేస్తూ చికిత్స అందించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. రెఫర్ అయిన రోగుల్లో చాలామంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కోకొల్లలన్నారు. అధికారులు జోక్యం చేసుకుని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, శశికుమార్, జిలానీబాషా, వినయ్, మహేష్, కుమార్, ఉదయ్, షరీఫ్, శశి, దేవేష్ పాల్గొన్నారు.









